ప్రజాశక్తి
శనివారం 4 నవంబరు 2023
5
శ్రీకాకుళం

నేడు, రేపు ప్రత్యేక ఓటర్ల నమోదు

శ్రీకాకుళం అర్బన్ : 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్ళ నిండిన యువత ఓటర్లుగా చేరేందుకు ఈనెల 4, 5 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 2,357 పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారులు ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అందుబాటులో ఉండి ఫారం-6 ద్వారా నమోదు ప్రక్రియ చేపట్టనున్నారు. గత నెల 27 నుంచి వచ్చే నెల 9వరకు ఓటర్ల నమోదు, తొలగింపు, సవరణలకు దరఖాస్తులను స్వీకరించేందుకు వీలుంది. ప్రత్యేకంగా బిఎల్ఒ కేంద్రాల వద్దే నమోదుకు రెండు రోజులు పాటు వీలు కల్పించారు. కొత్తగా ఓటర్ల నమోదు కోసం ఫారం-6, చనిపోయిన, బోగస్ ఓట్లు తొలగింపు, శాశ్వత నివాసం లేని వారు పేర్లు జాబితాల నుంచి తొలగించడానికి ఫారం-7, సవరణలు చేసుకునేందుకు ఫారం-8ను బిఎల్ఒలకు అందజేయాల్సి ఉంటుంది.

మోడీ విధానాలతో ప్రజలపై భారాలు

- నవరత్నాలు తప్ప రాష్ట్రంలో అభివృద్ధి లేదు
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.వి నాగేశ్వరరావు
- జిల్లాలో ముగిసిన ప్రజా రక్షణ భేరి యాత్ర

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మోడీ అనుసరిస్తున్న విధానాలతో ప్రజలపై తీవ్ర భారాలు పడుతున్నాయని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.వి నాగేశ్వరరావు విమర్శించారు. మందసలో ఈనెల మూడో తేదీన సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర రెండో రోజు శుక్రవారం ఎచ్చెర్ల మండలం చిలకపాలెం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అక్కడ నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని గ్యాస్ నిక్షేపాలను ప్రధాని మోడీ గుజరాత్‌కు తరలించుకుపోతున్నారని తెలిపారు. రాష్ట్రంలో లభ్యమవుతున్న గ్యాస్ నిక్షేపాలను మనమే వినియోగించుకుంటే, సిలిండర్‌ను రూ.400కే ఇవ్వవచ్చున్నారు. పైడిభీమవరం పారిశ్రామికవాడలోని పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో 13 ఏళ్లుగా కనీస వేతనాలను సవరించలేదని చెప్పారు. ప్రైవేట్ కంపెనీలకు మేలు కలిగించేందుకు వైసిపి ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లను పెట్టేందుకు ప్రయత్నిస్తోందని, వీటి వల్ల ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం మరింత పడుతుందన్నారు. చిలకపాలెంలో తరతరాలుగా సాగు చేసుకుంటున్న నారాయణపురం రైతుల భూములను వ్యాపారులు ఆక్రమించుకున్నారని చెప్పారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు వ్యాపారుల వైపు ఉంటారా? పేదల పక్షాన ఉంటారో తేల్చుకోవాలన్నారు. ప్రత్యామ్నాయ విధానాలు, రాజకీయ ప్రణాళిక ప్రజల ముందుంచేందుకు విజయవాడలో ఈనెల 15వ తేదీన నిర్వహించనున్న బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు హరిబాబు మాట్లాడుతూ జగన్ నవరత్నాలు తప్ప అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదని విమర్శించారు. రోడ్లు, మౌలిక వసతులు లేవని, రైతులకు గిట్టుబాటు ధర, కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించడంలో విఫలమయ్యారని చెప్పారు. విభజన చట్టం హామీలు, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు ఇవ్వకుండా రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బిజెపికి రాష్ట్రంలోని టిడిపి, వైసిపి జనసేన పార్టీలు మద్దతు పలుకుతున్నాయని విమర్శించారు.

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి మాట్లాడుతూ చిలకపాలెంలో మూడు, నాలుగు తరాలుగా సాగు చేస్తున్న భూములను అధికార పార్టీ నాయకుల అండతో వ్యాపారులు బలవంతంగా ఆక్రమించుకుంటున్నారని చెప్పారు. రైతులకు పట్టాలు ఇవ్వాలని ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పట్టించుకోవడం లేదని విమర్శించారు.

జిల్లాలో బస్సు యాత్ర ముగింపు

సభ అనంతరం అక్కడ్నుంచి విజయనగరం జిల్లా పూసపాటిరేగకు చేరుకుంది. ఈనెల 2న మందసలో ప్రారంభమైన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర శుక్రవారంతో ముగిసింది. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, కె.లోకనాథం, వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ధనలక్ష్మి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల సిపిఎం కార్యదర్శులు డి.గోవిందరావు, తమ్మినేని సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం

- 17,542 మంది సిబ్బంది అవసరం
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వచ్చే సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉన్నామని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల నిర్వహణ ముఖ్య అధికారి ముఖేష్ కుమార్ మీనా అమరావతి నుంచి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్‌పి జి.ఆర్ రాధికతో కలిసి కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 2,357 పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. సాయుధ భద్రతా దళాలు మినహా 11,313 మంది పోలింగ్ అధికారులతో కలిపి 17,542 మంది సిబ్బంది, పోలీసు వాహనాలు మినహా 600 వరకు పలురకాల వాహనాలు అవసరమని గుర్తించామని తెలిపారు. ఎన్నికల విధుల నిర్వహణకు సిబ్బంది కోసం తొమ్మిది శిక్షణా కేంద్రాలు, ఎన్నికల సామగ్రి పంపిణీ కోసం 8 డిస్పాచ్ కేంద్రాలు, తిరిగి వాటిని స్వీకరించేందుకు 8 కేంద్రాలు, 6 స్ట్రాంగ్‌రూమ్‌లు, 17 కౌంటింగ్ కేంద్రాలను ఇప్పటికే గుర్తించామని వివరించారు. ఆయా కేంద్రాల వద్ద పోలీసు భద్రత కోసం 1300 మందిని సిబ్బంది నియమించనున్నట్లు ఎస్‌పి రాధిక తెలిపారు. మొబైల్ సిగ్నల్స్ లేని 13 (పాతపట్నం 12, పలాస 1) పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, రానున్న రెండు మూడు నెలల్లో అక్కడ కొత్తగా సెల్ ఫోన్ టవర్లను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న 15 పోలింగ్ కేంద్రాలను గుర్తించామని వివరించారు. వచ్చే డిసెంబరు నెలాఖరుకు పోలింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తి చేయనున్నట్లు చెప్పారు. 2019లో ఎన్నికల సందర్భంగా 672 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు రూ.53 లక్షల విలువైన మద్యం సీజ్ చేశామని, 437 కిలోల గంజాయిని పట్టుకుని కేసులు నమోదు చేశామని వివరించారు. రానున్న ఎన్నికల దృష్ట్యా ఇప్పట్నుంచే పటిష్టమైన, కట్టుదిట్టమైన నిఘా పెట్టనున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఎఎస్‌పి జె.తిప్పేస్వామి తదితరులు ఉన్నారు.

టౌన్ ప్లానింగ్ విభాగంలో ఎసిబి తనిఖీలు

టౌన్ ప్లానింగ్ విభాగంలో తనిఖీలు చేపడుతున్న ఎసిబి అధికారులు

ప్రజాశక్తి - పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీ టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఎసిబి సిఐలు కె.భాస్కరరావు, హరి, ఎస్.వి రమణతో పాటు పది మంది సిబ్బంది రెండు వాహనాల్లో మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. నేరుగా టౌన్ ప్లానింగ్ విభాగంలోకి వెళ్లి తమ ఆధీనంలోకి తీసుకున్నారు. భవన నిర్మాణాలకు సంబంధించి రికార్డులను రాత్రి వరకు క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యాలయం లోపలకు బయట వ్యక్తులు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది సమక్షంలో ఆన్‌లైన్ రికార్డులను పరిశీలించారు. కొంతమంది భవన యజమానులను కార్యాలయానికి రప్పించి విచారణ చేపట్టారు. పద్మనాభపురం సమీపంలో ప్రైవేట్ ఆస్పత్రి భవన నిర్మాణానికి సంబంధించి మున్సిపాల్టీ టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులు మంజూరు చేశారా..? లేదా..? అని భవన యజమానిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ భాస్కరరావు మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్‌పై వచ్చిన ఫిర్యాదుల మేరకు తనిఖీలు చేపట్టామని, కొన్ని భవనాలను పరిశీలించినట్లు తెలిపారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఎసిబి అధికారులు తనిఖీలు చేపట్టడం జంట పట్టణాల్లో చర్చనీయాంశమైంది.



విజయనగరం జిల్లాలో ఇటీవల సంభవించిన రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి నివాళ్లర్పిస్తూ ఆమదాలవలస మండలంలోని గాజులకొల్లివలస వద్ద సంగమేశ్వర స్వామి కొండ దిగువన సైకత శిల్పి గేదెల హరికృష్ణ సైకత శిల్పాన్ని వేశారు.

- ప్రజాశక్తి, ఆమదాలవలస

రహదారుల అభివృద్ధికి చర్యలు

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండల కేంద్రం నుంచి బొర్రంపేట కూడలి వరకు రూ.2.75 కోట్లతో సుమారు ఏడు కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఆర్అండ్‌బి రహదారికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను శతశాతం నెరవేర్చారని కొనియాడారు. సంక్షేమం, అభివృద్ధిపై ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని చెప్పారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అధిక నిధులను మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి వెంకట గోపాల సత్యనారాయణ, సర్పంచ్ బొడ్డేపల్లి వెంకట సూర్యచాందిని, బిసి సెల్ డైరెక్టర్ ఎం.రమణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బద్రి రామారావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ సీతారాం

శ్రీకాకుళంను కరువు జిల్లాగా ప్రకటించాలి

- రాష్ట్రంలో 400 కరువు మండలాలు ఉంటే 103 మాత్రమే ప్రకటన
- ఇక రైతుల సమస్యలపై ఉద్యమిస్తాం
- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

వర్షాభావ పరిస్థితులతో రాష్ట్రంలో కరువు విలయతాండవం చేస్తున్నా, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కళ్లకు బైర్లు కమ్మాయా అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాభావ పరిస్థితులు సర్వసాధారణమని, దాన్ని అధిగమించే సమర్థవంతమైన నాయకత్వం లేకపోవడంతో ప్రస్తుతం గడ్డు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ ఏడాది పరిస్థితులు మరింత జఠిలమై పంటలకు నీటి చుక్క లేదని, చివరకు మూగజీవాలు సైతం దాహంతో కొట్టుమిట్టాడే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి పంట పెట్టుబడులు పెట్టిన రైతులు వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోయి తీవ్ర నష్టానికి గురయ్యారన్నారు. ఈ పరిస్థితులు పక్క రాష్ట్రాల్లో ఉన్నా, అక్కడి ప్రభుత్వ యంత్రాంగం ఎప్పటికప్పుడు పరిస్థితులపై సమీక్షలు నిర్వహించి అవసరమైన చర్యలు చేపడుతున్నాయని చెప్పారు.రాష్ట్రంలో రైతులను గాలికొదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సి ఉండగా, అవేవీ చేయకుండా 103 కరువు మండలాలను ప్రకటించి ప్రభుత్వం చేతులు దులిపేసిందని విమర్శించారు. టిడిపి పరిశీలనలో 400 మండలాలు కరువుతో అల్లాడుతున్నాయని తేలిందన్నారు. జిల్లాలో ఇద్దరు మంత్రులు, ఒక స్పీకర్ ఉండి కూడా ఒక్క మండలాన్నీ కరువు మండలంగా ప్రకటించుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. శ్రీకాకుళం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై ఇక ఉద్యమిస్తామని చెప్పారు.

జిల్లాలో వంశధార, నాగావళి నదులున్నా ఇసుక దోపిడీ కోసం వైసిపి నాయకులు నీటిని ఎండగట్టి వ్యాపారం చేసుకోవడంతో ఆయకట్టు భూములకూ నీరందని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. ఎత్తిపోతల పథకాలకు ఫీజులు తొలగించారని, దీనిపై కలెక్టర్, వంశధార ఎస్ఇ దృష్టికి తీసుకెళ్తే రెండు రోజులు పెట్టి మళ్లీ తొలగించారని చెప్పారు. రైతుల నోట్లో కలెక్టర్ మట్టి కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎత్తిపోతల పథకాలను సాగునీరు అందించకపోతే రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో టిడిపి నాయకులు చౌదరి బాబ్జీ, బోయిన గోవిందరాజులు, చాపర గణపతిరావు, బగాది శేషు, కె.నాగయ్యరెడ్డి, మల్లా బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడును కలిసిన పిట్టవానిపేట గ్రామస్తులు

గయానాలో చిక్కుకున్న వారిని స్వదేశానికి రప్పించాలి

ఉపాధి నిమిత్తం వెళ్లి విదేశాల్లో చిక్కుకున్న మండలంలోని పిట్టవానిపేట గ్రామస్తులను స్వదేశానికి రప్పించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే అచ్చెన్నాయుడుకు బాధిత కుటుంబసభ్యులు కోరారు. పొట్ట కూటి కోసం సౌత్ అమెరికాలోని గయనాకు వెళ్లిన తూలు గారయ్య, తూలు సింహాచలం, తూలు రామారావు అక్కడ పడుతున్న కష్టాలను వివరించారు. దీనిపై అచ్చెన్నాయుడు స్పందిస్తూ విదేశాంగ శాఖ అధికారులతో ఎంపీ రామ్మోహన్ నాయుడు మాట్లాడి వారిని స్వదేశానికి తీసుకొస్తామని హామీనిచ్చారు.

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యం

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎస్‌పి జి.ఆర్ రాధిక తెలిపారు. స్థానిక ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన పోలీస్ పరేడ్‌ను పరిశీలించారు. సిబ్బంది గౌరవ వందనాన్ని ఎస్‌పి స్వీకరించారు. సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు పరేడ్ జరిగే విధానం, కమాండ్స్, సిబ్బంది చేసే డ్రిల్ మూమెంట్స్, పోలీసుల విధులు, డాగ్ స్క్వాడ్ పనితనాన్ని స్వయంగా వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజూ కొంత సమయాన్ని వ్యాయామానికి కేటాయించి, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు.

అనంతరం ఆర్మ్‌డ్ పోలీసు సిబ్బంది సమస్యలపై గ్రీవెన్స్ నిర్వహించారు. అనారోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలను పోలీస్ సిబ్బంది ఎస్‌పికి విన్నవించుకోగా, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎఎస్‌పిలు టి.పి విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, డిఎస్‌పిలు జి.వి ప్రసాదరావు, ఎస్.వాసుదేవ్, డి.ప్రసాదరావు, విజయ్ కుమార్, సిఐ పి.శ్రీనివాసరావు, ఆర్ఐలు ఉమా మహేష్, సురేష్, ఆర్మ్‌డ్, సివిల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తి చేసిన ఇళ్లకు సౌకర్యాలు

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జగనన్న కాలనీల్లో నిర్మాణం పూర్తి చేసిన ఇళ్లల్లో విద్యుత్, తాగునీరు వంటి సౌకర్యాలు ఉండాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించకపోతే, వాటిని రద్దు చేసి అర్హులైన వారికి మంజూరు చేయాలని ఆదేశించారు. దీనివల్ల మరో కుటుంబానికి లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రతి నెలా రెండుసార్లు కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గృహనిర్మాణ శాఖ అధికారులు సమావేశమై ప్రగతి సాధించాలని చెప్పారు. విద్యుత్ సరఫరాలో జాప్యమైతే ఇపిడిసిఎల్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించే బాధ్యతను గృహ నిర్మాణ శాఖ అధికారులు తీసుకోవాలన్నారు. నివాసం ఉంటున్న ఇళ్లకు జల్ జీవన్ మిషన్ ద్వారా తాగునీరు అందించాలన్నారు. ఆర్థిక సమస్యలున్న లబ్ధిదారులు ఎపిఎంలతో మాట్లాడి రుణాలు తీసుకొని ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. 2024 నాటికి ఇళ్ల నిర్మాణాలు శతశాతం పూర్తి కావాలన్నారు. హౌసింగ్ పథకంలో లబ్ధిదారులు మెప్మా గ్రూపులో సభ్యులు కాకపోతే వారిని స్వయం సహాయక సంఘాల గ్రూపులో చేర్పించి సాయపడాలన్నారు. ఇళ్ల నిర్మాణంలో రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచినందుకు కృషి చేసిన ఇఇలు అప్పారావు, రామ్మూర్తికి అవార్డులు అందజేశారు. సమావేశంలో గృహనిర్మాణ సంస్థ పీడీ గణపతిరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ప్రసాదరావు, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, డ్వామా పీడీ చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవకులుగా పారాలీగల్ వాలంటీర్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

జిల్లాలో న్యాయసేవలను స్వచ్ఛందంగా తెలియజేయడంతో పాటు పలు సేవా కార్యక్రమాల్లో పారాలీగల్ వాలంటీర్లు భాగస్వాములు కావాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. కోర్టు ఆవరణలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో పారా లీగల్ వాలంటీర్ల శిక్షణ కార్యక్రమానికి అర్హులైన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను శుక్రవారం చేపట్టారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారా లీగల్ వాలంటీర్లు స్వచ్ఛందంగా సేవ చేయటానికి ముందుకు రావాలన్నారు. సామాజిక బాధ్యత కలిగి ఉండడమే కాకుండా, న్యాయస్థానం గౌరవ ప్రతిష్టలు కాపాడేలా ప్రవర్తించాలన్నారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా జిల్లా మూడో అదనపు జిల్లా జడ్జి భాస్కరరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంపిఆర్ లా కాలేజ్, అంబేద్కర్ యూనివర్సిటీ లా కోర్సు విద్యార్థులు, మెప్మా , అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మాణిక్యపురం విద్యార్థులు

కవిటి : ప్రకాశం జిల్లా ఒంగోలులో ఈనెల 4 నుంచి ఆరో తేదీ వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు మాణిక్యపురం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సుమలత తెలిపారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎం.మోహనసాయి, కె.వినీల, కె.లలిత అండర్-17 సాఫ్ట్‌బాల్ విభాగంలో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.తోటారావు, రవికుమార్‌ను అభినందించారు. ఎంపికైన క్రీడాకారులకు ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, పిఎసిఎస్ చైర్మన్ దేవరాజ్ సాహు, ఎంఇఒ ధనుంజయ అభినందించారు.

IN THE HONOURABLE COURT OF THE 2nd ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT SRIKAKULAM (SPL MOBILE COURT)
OS 303/2022

Between:
అంబటి అమ్ములు --వాది -పిటీషనర్స్
And:
అల్లు ఆదినారాయణ వగైరాలు --ప్రతివాదులు

To,
D-4 పోదిలాపు అచ్చుతరావు, తండ్రి రాములు, 28సం॥, వ్యవసాయం, తండేంవలస గ్రామం, శ్రీకాకుళం రూరల్ మండలం, శ్రీకాకుళం జిల్లా.

పై నెంబర్ దావాలో వాది దావా షెడ్యూలు ఆస్తిలో తన వాటా నిమిత్తం దాఖలు చేసియున్నది. సదురు దావా **తేదీ 10-11-2023** మీ హాజరు నిమిత్తం వాయిదా అయియున్నది. ఆ దినం మీరు పైకోర్టులో **ఉ॥ 10.30 గం॥ లకు** స్వయంగా గాని మీ తరుపు అడ్వకేట్ ద్వారా గాని పై కోర్టుకు హాజరై మీకు గల అక్షేపణలు తెలియపరచు కొనవలెను. లేనియెడల మీ పరోక్షమంద కేసు విచారించి తీర్మానించడమగును.

// కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం. //

పంచిరెడ్డి ఈశ్వరరావు
వాది తరపు న్యాయవాది,
ఫోన్: 9949502216.

మహారాజశ్రీ శ్రీకాకుళం జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు శ్రీకాకుళం
OS No.77/2017

Between: **Gangu Adilakshmi and another** --plaintiffs
And: Seera Manikyam and Othors --Defendants

To,
D-13 : Allu Suryanarayana S/o late Mallesh, Aged about 28 years, Hindu,cultavation, R/o chapuram villiage, pathrunivalasa post, Srikakulam, Srikakulam Dist.

పైనంబరు దావాలో OS.No.77/2017లో మీరు 13వ ప్రతివాదిగా IA19/2023 dated 10-5-2023 ప్రకారం చేరియున్నారు. సదరు OS 77/2017 దావాలో మీకు ఎన్నిమార్లు నోటీసులు కట్టిన మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనందున సదరు పై కోర్టువారు తేది 10-10-2023 పబ్లికేషన్ ఆర్డర్ చేసియుంటిరి. కావున సదరు దావా తేది **08-11-2023 దిన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసి యున్నారు.** కావున ఆరోజు మీరు స్వయంగాగాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపనలు తెలియ జేసుకోవలేను. లేనియడల మీ పరోక్షంగా తీర్పు చెప్పబడును.

శీర శంకరరావు
న్యాయవాది
శ్రీకాకుళం,
సెల్: 9182012843

IN THE HONOURABLE COURT OF THE 1st ADDITIONAL DISTRICT JUDGE SRIKAKULAM.
IA 28/2022 in IA 26/2022 in OS 27/1957

Between: **Kalaga Dibbayyya,** --Petitioner
And:
Kalaga Bandari (died) & others --Respondents

To,
R-10. Kola Chandrasekhar, s/o Balaram, Hindu, aged 45 years, Cultivation, Pedapadu Village, Srikakulam Mandal & District.
R-23. Vandrangi Radha Kumari, w/o Uday Bhaskara Rao, Hindu,aged 52 years, household duties, R/o D.No.2-2-27/27, Dwaraka Nagar, near Employment office, illisipuram, Srikakulam.

పిటిషనరు పై కోర్ట్ లో పై నెంబరు ఫైనల్ డిక్రీ మరియు నాట్ టు ఎలివేషన్ పిటీషన్స్ దాఖలు చేయగా సదరు పిటిషనులో మీరు 10,23వ రెస్పాండెంట్స్ అయినందున కోర్ట్ వారు మీ యొక్క హాజరు నిమిత్తం **తే. 08-11-2023 దీకు** శ్రీ కోర్టు వారు పై నెంబరు కేసు ను వాయిదా వేసినారు కావున పై తేది నాడు **ఉదయం 10-30 గం॥ కు** పై కోర్ట్ వారి ఎదుట మీరు స్వయం గాని వకీలు ద్వార గాని హాజరు అయి మీకు గల ఆక్షేపణలు తెలియపరుచు కొనవలెను లేని యెడల మీ పరోక్షంగా తీర్మానించడమగునని ఇందుములంగా తెలియపరచడమైనది.

బరాటం నాగేశ్వరరావు
న్యాయవాది, శ్రీకాకుళం,
సెల్: 9391380645.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
I.P.24/2023

Between: **Budumuru Raju.** --Petitioner.
And:
Jammi Appalaswamy & others --Respondents.

R-1. Jammi Appalaswamy, S/o Narayanaswamy, aged 42 years, Hindu, Business, residing at Door No.325-1-37, Karajada village, Srikakulam mandal and district.
R-2. Rayala Jagadeeswara Rao, S/o Krishnamurthy, aged 50 years, Hindu, resident of Door No.23-295/B, Kummari veedhi, Narasannapeta town and mandal, Srikakulam district.
R-3. Chinchula Sankara Rao, S/o Linganna, aged 35 years, Hindu, resident of Door No.2-37, Mandadi village, Akkulapeta, Srinivasacharyulupeta, Amadalavalasa mandal, Srikakulam district.
R-4. Ulapalli Thavudu, S/o Buchayya, aged 67 years, Hindu, resident of Door No.2-82, Kummari veedhi, Labham village, Burja mandal, Srikakulam district.
R-5. Uriti Krishna Rao, S/o Late Thavudu, aged 52 years, Hindu, resident of Door No.1-87, YSR Colony, Vajrapukotturu, Ananthagiri, Venkatapuram, Srikakulam district, Pin-532220.
R-6. Ambati Sankara Rao, S/o Papayya, aged 33 years, Hindu, resident of Door No.1-82, Main Street, Batteru village, Ponnam post, Srikakulam rural mandal and district.
R-7. Ummadarapu Satyam, S/o Mukhalingam, aged 55 years, Hindu, resident of Door No.C-192, Gollalavalasa village, Srikakulam rural mandal, Srikakulam district, Pin-532429.
R-8. Kannuru Simhachalam, S/o Suryanarayana, aged 32 years, Hindu. Cultivation, residing at Door No.1-37, Mandadi village, Akkulapeta, Amadalavalasa mandal, Srikakulam district.

Take notice that the insolvency petition filed by the above named petitioner is posted for hearing at **10.30 AM., on 06-12-2023** before the Honourable Prinicipal Senior Civil Judge Court, Srikakulam, and if you wasn't to contest the matter you may do so either in person or by a duly instructed pleader and if you fail to show cause matter will be decided in your absence and expert.

H.RAMAKRISHNA
Advocate,
Srikakulam, Cell: 990837008.

మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

బస్సుయాత్ర విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - బూర్జ

మండలంలో మదనాపురం గ్రామంలో నిర్వహించిన మండలస్థాయి సమావేశానికి స్పీకర్ తమ్మినేని సీతారాం శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 7న ఆమదాలవలసలో జరిగే బస్సుయాత్రను విజయవంతం చేయాలన్నారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి బస్సుయాత్రకు తీసుకొచ్చే బాధ్యత చేపట్టాలన్నారు. అలాగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చివరి దశకు వచ్చిందని ఆ కార్యక్రమాన్ని పెద్దఎత్తున విజయవంతం చేయాలన్నారు. ఆమదాలవలసలో స్టేడియం, క్రీడా పరికరాలు వంటి కార్యక్రమాలను ప్రారంభించేందుకు మంత్రి రోజా రానున్నారని, ఈ కార్యక్రమాలు ప్రజలకు అవగాహన కల్పించి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో చిరంజీవి నాగ్, రాష్ట్ర టిట్కో డైరెక్టర్ గోవిందరావు, జెడ్‌పిటిసి రామారావు, మండల ప్రత్యేకాహ్వానితులు నాగేశ్వరరావు, డిసిఎంఎస్ మెంబర్ జల్లు జలంగానాయుడు, వైస్ ఎంపిపిలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నియామకపత్రం అందజేత

మండలంలో మామిడి వలస అంగన్వాడీ కార్యకర్త పోస్టుకు ఉద్యోగ నియామకపత్రాన్ని స్పీకర్ తమ్మినేని సీతారాం అందజేశారు. గతంలో అంగన్వాడీ కార్యకర్త అనారోగ్యంతో మృతిచెందగా అక్కడ ఆయాగా పనిచేసిన కరణం వెంకటలక్ష్మికి ప్రమోషన్‌పై అంగన్వాడీ కార్యకర్త పోస్టుకు ఉద్యోగ నియామకపత్రం అందజేశారు. ఆయనతో పాటు ఐసిడిఎస్ పిఒ గీతా రాణి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ సుశీల

'ఉపాధి' సామాజిక తనిఖీ

వజ్రపుకొత్తూరు : ఉపాధి హామీ పనులు వ్యవసాయానికి అనుసంధానం చేయాలని సర్పంచ్ తుంగాన సుశీల అన్నారు. శుక్రవారం పాతటెక్కలి సచివాలయంలో సామాజిక తనిఖీపై నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. వ్యవసాయం సాగులో కార్మికుల కొరత రైతులను వేధిస్తుందని, ఉపాధి హామీ వేతనదారులకు సాగు సమయంలో పనిదినాలు కల్పిస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులపై అధికారులు సామాజిక తనిఖీ నిర్వహించారని తెలిపారు. ఉపాధిహామీ పథకం ద్వారా సాగునీటి చెరువులు, గృహాలు, పాఠశాలలు, రహదారులు అభివృద్ధి జరిగిందన్నారు. వేతనందారులకు గరిష్టంగా వేతనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి బాలక శ్రీను, దాలయ్య, సోషల్ ఆడిట్ డిఆర్‌పి సత్యనారాయణ, టిఎ జయరామ్, క్షేత్ర సహాయకులు నీలవేణి, ఎఎంసి చైర్మన్ కొల్లి జోగారావు, పంచాయతీ కార్యదర్శి ఢిల్లేశ్వరావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పుట్టినరోజు వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్న కార్యకర్తలు

దువ్వాడ పుట్టినరోజుకు భారీ ఏర్పాట్లు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పుట్టినరోజుకు కార్యకర్తలు, అభిమానులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం దువ్వాడ శ్రీనివాస్ జన్మదిన వేడుకలు సందర్భంగా టెక్కలి నేషనల్ హైవేలో ఎంఎల్‌సి నూతనంగ నిర్మాణం చేపట్టిన క్యాంపు కార్యాలయం వద్ద దువ్వాడ శ్రీనివాస్ అభిమానులు, వైసిపి కార్యకర్తలు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జెమ్స్ ఆస్పత్రి వైద్య బృందం సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఈ వైద్య శిబిరంలో అన్ని రకాల సాధారణ వ్యాధులను, గుండె వ్యాధులను, కిడ్నీ వ్యాధులను, కేన్సర్ వ్యాధులను ఉచితంగా తనిఖీలు నిర్వహించి, అవసరమైనవారికి మందులు ఉచితంగా అందించనున్నారు.



ప్రథమ స్థానం సాధించిన లోక్‌జిత్

సత్తా చాటిన లోక్‌జిత్

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఇటీవల ఆగ్రాలో నిర్వహించిన అంతర్జాతీయ షూటింగ్ పోటీల్లో ఆమదాలవలస మున్సిపాల్టీ పూజారిపేటకు చెందిన చౌదరి లోక్‌జిత్ ప్రథమ స్థానం సాధించాడు. పదో అంతర్జాతీయ క్రాస్ బౌ షూటింగ్ ఛాంపియన్ షిప్‌లో జూనియర్ బాలుర ఓపెన్ ఫ్రీ స్టైల్ కేటగిరీలో స్వర్ణ పతకం లభించింది. లోక్‌జిత్ తల్లిదండ్రులు రవికుమార్, సహజ ప్రస్తుతం విశాఖపట్నంలో నివాసం ఉండడంతో, అక్కడే ఆరో తరగతి చదువుతున్నాడు. 11 ఏళ్ల వయసులో అంతర్జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన లోక్‌జిత్‌ను కుటుంబ సభ్యులు, బంధువులు, పలువురు క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

సిక్కోలు ఖ్యాతిని పెంచిన కళాకారులు

శ్రీకాకుళం అర్బన్ : ప్రతిభను గుర్తించి వైఎస్‌ఆర్ జీవిత సాఫల్య పురస్కారాన్ని ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందని, తమ పేర్లు ప్రతిపాదించి పంపినందుకు ప్రముఖ రంగస్థల కళాకారులు ఎడ్ల గోపాలం, తప్పెటగుళ్ల కళాకారుడు కోన సన్యాసిరావు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను శుక్రవారం కలిశారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్‌సింగ్, ఇంటాక్ కో కన్వీనర్ జగన్నాథం నాయుడు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కవిటి : క్రీడలతో ఒత్తిడికి దూరమై విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంఇఒ ధనుంజయ అన్నారు. మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు శుక్రవారం వివిధ రకాల ఆట వస్తువులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆటవస్తులను సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు క్రీడల కోసం కొంత సమయం కేటాయించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త ఓటర్లను నమోదు చేయాలి

ప్రజాశక్తి - టెక్కలి

కొత్తగా మార్పులు, చేర్పులు చేయనున్న ఓటర్ల జాబితా సర్వేను వేగవంతం చేయాలని టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. టెక్కలి, నందిగాం మండలాల రెవెన్యూ అధికారులతో శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే విడుదల కాబడిన ఓటర్ల జాబితా గ్రామాల్లో అందుబాటులో ఉన్న దృష్ట్యా వాటిపై వచ్చే అభ్యంతరాలను నమోదు చేసుకుని వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఫారాలు నమోదు, స్వీకరణ వంటి వాటిపై గ్రామాల వారీగా పర్యవేక్షణ చేపట్టాలన్నారు. సమావేశంలో టెక్కలి, నందిగాం మండలాల తహశీల్దార్‌లు కురమాన ప్రవల్లిక ప్రియ, ఎ.పద్మావతి, సూపర్‌వైజర్లు, బిఎల్‌ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఓటర్లు నమోదులో బిఎల్‌ఒ, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి తప్పులు దొర్లకుండా చూసుకోవాలని ఆర్‌డిఒ ఎస్.భరత్ నాయక్ ఆదేశించారు.

టెక్కలి : సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బిఎల్‌ఒ, రెవెన్యూ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉండాలన్నారు. గతంలో నమోదు చేసుకున్న కొత్త ఓటర్ల జాబితా సరి చూసుకోవాలన్నారు. డిసెంబర్ 9 వరకు కొత్త ఓటర్లు నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. సమీక్షా సమావేశంలో తహశీల్దార్ గురు ప్రసాద్, డిటి శ్రీహరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆమదాలవలస : ఓటర్ నమోదు స్పెషల్ క్యాంపైన్ డేను నిర్వహించి నూతన ఓట్లను నమోదు చేయాలని ఆర్‌డిఒ సిహెచ్ రంగయ్య అన్నారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, నాలుగు మండలాల బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లు, తహశీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితాను గత నెల 27న పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచురించడం జరిగిందని తెలిపారు. ఆ ఓటరు జాబితాలో ఏమైనా తప్పులున్నా, కొత్తగా ఓటరుగా నమోదు కావాలన్నా డిసెంబర్ 9 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అందులో భాగంగానే స్పెషల్ క్యాంపైన్ డేస్ నవంబర్ 4, 5వ తేదీలు మరలా డిసెంబర్ 2, 3వ తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో వైసిపి నాయకులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు బి.వి.రమణమూర్తి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బస్వా షణ్ముఖరావు, అశోక్, ఎస్.రామారావు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ దువ్వాడ అమర్నాథ్ పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి

నరసన్నపేట : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విరమించుకోవాలని నరసన్నపేటలో స్థానిక సౌభాగ్య లక్ష్మి కళ్యాణ మండపం వద్ద విద్యార్థి యువజన సంఘాలు, అన్ని రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు చాపర వెంకటరమణ, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ రవి, టిఎన్‌ఎస్ నాయకులు వరుణ్, తెలుగు యువత నాయకులు రవి, జనసేన నాయకులు బలగ ప్రవీణ్, పిల్లి దండాసి, టిడిపి నాయకులు కింజరాపు రామారావు, జామి వెంకటరమణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు దుప్పట్ల మధు సిఐటియు నాయకులు నరసింహులు మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వ ఆస్తులు కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి ఉందని, అలాంటి ప్రభుత్వాలు విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ చేసేందుకు ముందుకు వెళ్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్టీల్‌ప్లాంట్

సమావేశంలో నినదిస్తున్న నాయకులు

పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆస్తులను అమ్మకం చేయడం అన్యాయమన్నారు. కరోనా వేళలో కూడా దేశానికి సేవలందించిన ఘనత విశాఖ ఉక్కు ప్లాంట్‌కు సొంతమన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేస్తున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యాసంస్థలు స్వచ్ఛందంగా ఈనెల 8వ తేదీన జరిగే బంద్‌ను ప్రకటించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎ.రాము, నాయకులు ఆమోష్, సిద్దు, రామారావు, సిపిఐ నాయకులు నెయ్యిల నారాయణ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మధుబాబుకు అమెరికా పురస్కారం

అవార్డు అందుకుంటున్న మధుబాబు

పలాస: మండలం బ్రాహ్మణతర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు ఆస్పన్న మధుబాబు అమెరికా రాజధాని వాషింగ్టన్ డిసిలో ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఎక్స్చేంజి ప్రోగ్రాంలో భాగంగా ఫుల్‌బ్రైట్ టీచింగ్ ఎక్స్‌లెన్స్ అచీవ్‌మెంట్ పురస్కారాన్ని శుక్రవారం అందుకున్నారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో యునైటెడ్ స్టేట్స్ ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ప్రతినిధులు సెప్టెంబర్ 2021లో దీనికి సంబంధించి అంతర్జాలం ద్వారా దరఖాస్తులు ఆహ్వానించగా ఆగష్టు 2022లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మనదేశం నుంచి ఆరుగురు ఎంపికకాగా అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి మధుబాబు ఒకరు కావడం విశేషం. ప్రపంచ వ్యాప్తంగా 68 దేశాలకు చెందిన 151 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 2023 సెప్టెంబర్ 13 నుంచి నవంబర్ 2 వరకూ మొత్తం ఆరువారాల పాటు అమెరికాలో నార్త్ కరోలినాలోని గ్రీన్స్ బోరో యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో వివిధ దేశాలకు చెందిన విద్యా వ్యవస్థలను అధ్యయనం, సంస్కృతుల మార్పిడి, ఆన్‌లైన్ టూల్స్ అభివృద్ధి, పాఠ్యపథకంపై అవగాహన, మూల్యాంకన విధానాలు, టోఫెల్ తదితర విషయాలపై జరిగిన వర్క్‌షాప్‌లో మధుబాబు పాల్గొని వాషింగ్టన్‌లో జరిగిన కాన్వకేషన్‌లో ప్రశంసాపత్రాన్ని సీనియర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జోనాథన్ ఐరెక్స్ నుంచి అందుకున్నారు. మధుబాబుని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొర్ల వైకుంఠరావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

అర్హతే ప్రామాణికంగా పాలన

పోలాకి : పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించేలా ప్రభుత్వం పాలన సాగుతోందని ఎంఎల్‌ఎ ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శుక్రవారం దీర్ఘాశి సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ధర్మాన కృష్ణదాస్, సతీమణి పద్మప్రియ పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నూతన సచివాలయం భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, సర్పంచ్ మెండ సుమంగళి కృష్ణ, ఎంపిటిసి ప్రతినిధి తాతారావు, సీనియర్ నాయకులు పాకోటి అప్పారావు, డిటి శ్రీనివాసరావు మెండ చిట్టెన్న, మెండ రామినాయుడు పాల్గొన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

లావేరు: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంట్ రహదారులు, కాలువలు, జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటా కుళాయిలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తదితర పనులు పూర్తి చేయాలన్నారు. దీనిపై సంబంధిత విభాగాల అధికారులు బాధ్యతాయుతంగా పనులు

పోలాకి : సంక్షేమ పథకాల పోస్టర్‌ను అందజేస్తున్న కృష్ణదాస్

పూర్తి చెయ్యాలన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు చూపించే సమస్యలకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి ఎం. సీతంనాయుడు, ఎంపిడిఒ కుప్పిలి సురేష్ కుమార్, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనువాసరావు, ఇఒపిఆర్‌డి విశ్వేశ్వరరావు, ఇఒపిఆర్‌డి సీతంనాయుడు, జఇ శివబాబు పాల్గొన్నారు.

బీమా నగదును అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

వైఎస్‌ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మండలంలో పెద్ద పద్మాపురం గ్రామానికి చెందిన బోయిన హరినాథ్ ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబానికి వైఎస్‌ఆర్ భీమా నగదును ఎంపిటిసి ప్రతినిధి ఉర్లాన ఋషి, సర్పంచ్ ప్రతినిధి మాలతి శ్రీధర్ శుక్రవారం అందజేశారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో తక్షణసాయం కింద రూ.10వేలు ఆయన భార్య బోయిన ధనలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి సిహెచ్ అప్పారావు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఇటీవలే విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందిన యువకుడు బెహరా రమేష్ కుటుంబాన్ని ఇచ్ఛాపురం తెలగకుల సంక్షేమ సంఘం రూ.21 వేలు ఆర్థిక సహాయాన్ని అందించింది. పట్టణంలోని షరాబువీధి ప్రాంతంలో నివసిస్తున్న బెహరా రమేష్ దసరా సందర్భంగా తన మెకానిక్ షాప్‌లో ద్విచక్ర వాహనాల సర్వీసింగ్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. వెంటనే తక్షణ సహాయంగా రూ.4 వేలు మొత్తాన్ని తెలగకుల సంక్షేమ సంఘం బెహరా రమేష్ కుమార్ కుటుంబానికి అందించింది. శుక్రవారం మరో రూ.17 వేలు రమేష్ పెద్దకర్మ సందర్భంగా రమేష్ తల్లిదండ్రులకు అందించారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం తెలగకుల సంక్షేమ సంఘం నాయకులు కాశీపురి బాల సూర్యకుమార్, కట్ట సూర్యప్రకాశరావు, ముత్యాల శ్రీనివాసరాజు, మీనా కుమార్, జోగారావు, పల్లంటి చిరంజీవి పాల్గొన్నారు.

పురుగులమందు దుకాణం తనిఖీ

ప్రజాశక్తి - కొత్తూరు

మండలంలో మెట్టూరులో అయ్యప్ప ట్రేడర్స్ ఎరువులు, పురుగుల మందు దుకాణంలో మండల వ్యవసాయాధికారి ఎన్.శ్రీనివాసరావు శుక్రవారం తనిఖీ నిర్వహించారు. దుకాణంలో ఉన్న నాగార్జున పెర్టిలైజర్ అండ్ కెమికల్ కంపెనీకి చెందిన 20:20 ఎరువులు నమూనాను సేకరించి తిరుపతిలో ఉన్న కోడింగ్ కేంద్రానికి విశ్లేషణ నిమిత్తం పంపించటం జరిగిందన్నారు. ఏమైనా తేడా ఉంటే ఎరువులు నియంత్రణ చట్టం ప్రకారం చర్యలు తప్పవన్నారు. అలాగే షాపులో ఉన్న రిజిస్టర్, రికార్డులను పరిశీలించారు. స్టాకు రికార్డులో ఉన్న సరుకులను షాపులో ఉన్న సరుకు వ్యత్యాసాలను పరిశీలించారు. ఈయన వెంట వ్యవసాయ విస్తరణ అధికారి రమేష్, మాధవరావు వున్నారు.

పురుగుల మందు షాపును తనిఖీ చేస్తున్న ఎఒ శ్రీనివాసరావు

తప్పుడు కేసులతో బాబును నిలువరించలేరు

ప్రజాశక్తి - పొందూరు

తప్పుడు కేసులతో తమ అధినేత చంద్రబాబును వైసిపి ప్రభుత్వం నిలువరించలేదని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలో టిడిపి నూతన కార్యాలయ ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. తప్పుడు కేసులతో భయపెట్టి ఎన్నికల్లో ప్రచారాలు నిర్వహించకుండా నివారించాలన్న పథకంలో భాగంగానే స్కిల్ కేసులో అక్రమ అరెస్టు చేశారన్నారు. రాజకీయంగా చంద్రబాబును ఎదుర్కొనలేకే జగన్మోహన్ రెడ్డి ఈ కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. జగన్మోహన్ రెడ్డి చేతకాని పాలనను, అరాచకాలను రాష్ట్రప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈయనతో పాటు టిడిపి మండల ఉపాధ్యక్షులు

టిడిపి కార్యాలయ పనులను పరిశీలిస్తున్న రవికుమార్

బాడాన శేషగిరి, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర్, దుప్పల గణపతి, సీపాన భాస్కరరావు, కాలెపు శ్రీను, కిల్లాన భాస్కర్ ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు రక్ష

ప్రజాశక్తి - పొందూరు

మండలం మలకాం గ్రామంలో తాడివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 320 మందికి వైద్య పరీక్షలు జరిపి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి ప్రతినిది కిల్లి నాగేశ్వరరావు, సర్పంచ్ జె.శ్రీనివాసరావు, ఎంపిటిసి ప్రతినిధి వి.మోహనరావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, జెసిఎస్ బాడాన వెంకట కృష్ణారావు, వైసిపి రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి బండారు జైప్రతాప్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, ఇఒపిఆర్‌డి సింహాచలం, వైద్యాధికారులు జి.రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలో పొన్నుటూరు గ్రామంలో శుక్రవారం

కొత్తూరు : మందులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

జగన్నన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సర్పంచ్ ఎద్దు చామంతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటును తిలకించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బి.శ్రీను, జి.ఆనందరావు, ఎద్దు సంతోష్ కుమార్, వైద్యులు ప్రవీణ్‌కుమార్, జానకి రామయ్య పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పర్యటన

మెళియాపుట్టి : మండలంలో సంతోషపురం, ముక్తాపురం, చోంపపురం, దాసుపురం గ్రామాల్లో రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ శుక్రవారం పర్యటించారు. సంతోషపురం గ్రామానికి చెందిన రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్ ఎస్.ఈశ్వరమ్మ, మాజీ ఎంపిటిసి ఎస్. సుభాష్‌లను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ముక్తపురం గ్రామానికి చెందిన మాజీ శాసన సభ్యురాలు సుక్క పగడాలమ్మ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మాధవరావు, సర్పంచ్ జయసుధ, మాజీ సర్పంచ్ కామాక్షి, ప్రసాద్, బ్రహ్మలను కలిశారు. చోంపాపురం, దాసుపురం గ్రామస్తుల ఆహ్వానం మేరకు గ్రామాలను సందర్శించారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తనవంత

శ్రీకాంత్‌కు తిలకం దిద్దుతున్న మహిళ

కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శ్రీకాంత్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపిపి ఎస్. ఆదినాయుడు, వైస్ ఎంపిపి ప్రతినిధి పాడి అప్పారావు, సర్పంచ్‌లు పెద్దింటి చంద్రరావు, గణపతి ప్రధాన్, బోసి రామారావు, జనపరెడ్డి కన్నబాబు, ఎస్ గౌరేష్, ఎస్.రంగారావు, సభ్యులు ఎస్.రవికుమార్, నక్క వెంకలరావు ఉన్నారు.

అంతిమ యాత్ర కష్టాలు

వజ్రపుకొత్తూరు: మండలంలో పెద్దబొడ్డపాడు పంచాయతీ పరిధిలో సీతాపురం గ్రామానికి చెందిన విశ్వబ్రాహ్మణ కుటుంబాలకు అంతిమయాత్రలో కూడా కష్టాలు తప్పడం లేదు. చివరి మజిలీలో కూడా కష్టాలు తప్పకపోవడంతో వారు ఆవేదనకు గురవుతున్నారు. అదే గ్రామానికి చెందిన కోటి పారమ్మ శుక్రవారం మృతి చెందడంతో మృతదేహాన్ని పొలంగట్లపై శ్మశానవాటికకు తీసుకెళ్లడానికి చాలా ఇబ్బందులు పడ్డారు. విశ్వ బ్రాహ్మణ కుటుంబాలకు కేటాయించిన శ్మశానవాటికకు వెళ్ళడానికి రహదారి సౌకర్యాలు లేకపోవడంతో పాటు శ్మశానవాటికిను కొంతమంది రైతులు ఆక్రమించు కోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నట్లు ఆ కులానికి చెందిన వ్యక్తులు వాపోతున్నారు. అక్రమాలు తొలగించి, రహదారి సౌకర్యం కల్పించాలని అధికారులను కోరుతున్నారు.

చికిత్స పొందుతున్న గోవిందరావు

గొంతు కోసిన గుర్తుతెలియని వ్యక్తి

ప్రజాశక్తి - నందిగాం

మండలం దిమ్మిడిజోల కల్లాడ మధ్య రహదారిపై గురువారం అర్ధరాత్రి జరిగిన సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలలోకి వెళ్తే పలాస వెంకటేశ్వర కాలనీకి చెందిన గేదెల గోవిందరావు రైల్వే ఆటో స్టాండ్‌లో ఆటో నిలిపి ఉన్నాడు. రాత్రి 10:30 సమయంలో ట్రైన్ దిగివచ్చి నందిగామ మండలం దిమ్మిడిజోల ఆటో కావాలని చెప్పి. ఆటోపై కూర్చుని బండి గేటు వరకు వచ్చేసరికి కాపు తెంబూరని మరలా చెప్పడంతో ఇద్దరు మధ్య స్వల్పఘర్షణ జరిగింది. అనంతరం దిమ్మిడిజోల వెళ్లాలని చెప్పి గుర్తు తెలియని వ్యక్తి వెళ్ళాడు. అయితే గేదెల గోవిందరావు తన ఆటోపై గుర్తుతెలియని వ్యక్తిని ఎక్కించుకొని దిమ్మిడిజోల కల్లాడ మధ్య వచ్చేసరికి అనుమానం వచ్చి అద్దె డబ్బులు అడిగాడు. దీంతో గుర్తు తెలియని వ్యక్తి తన వద్ద తెచ్చుకున్న చాకుతో చేతులు, మెడపై బలమైన గాయాలు చేసి పరారయ్యాడని బాధితుడు నందిగామ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడిని పలాస ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలోని రిమ్స్ తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జ్ఞాపికను స్వీకరిస్తున్న ప్రసన్న కుమార్

అరసవల్లిని సందర్శించిన విశాఖ చీఫ్ విజిలెన్స్ అధికారి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విశాఖ జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంటు చీఫ్, అదనపు ఎస్‌పి ప్రసన్నకుమార్ శుక్రవారం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఆలయంలో స్వామివారికి నిర్వహించు సేవల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయనకు ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్ శేష వస్త్రాన్ని కప్పి జ్ఞాపికను అందజేశారు. ఆయనతో పాటు విశాఖపట్నం విజిలెన్స్ సిఐ వెంకు నాయుడు, శ్రీకాకుళం విజిలెన్స్ సిఐ వెంకట నారాయణ, ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపు మంత్రి బొత్స పర్యటన

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ ఈనెల 5న జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. శుక్రవారం ఒక ప్రకటనలో పర్యటన వివరాలు తెలిపారు. 5వ తేదీ ఉదయం 11:30 గంటలకు మంత్రి విజయనగరం నుంచి టెక్కలికి చేరుకుని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 12:30 గంటలకు వజ్రపు కొత్తూరు మండలం బెండి గేటుకు చేరుకుని మధ్యాహ్న భోజన విరామ అనంతరం పలాసలోని కె.కె రోడ్డులో 3.గంటలకు బహిరంగ సభలో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు విజయనగరం వెళ్తారని పేర్కొన్నారు.

రేపు రిటైర్డు ఉద్యోగుల సమావేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎపి స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సమావేశాన్ని కలెక్టరేట్ సమీపాన గల శాంతా కళ్యాణ్ అనురాగ నిలయంలో ఈనెల ఐదో తేదీన నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఆర్.ఎస్ ప్రకాశరావు, పి.నర్సింహమూర్తి, ఆర్గనైజింగ్ కార్యదర్శి సోమసుందరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల శాఖల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు హాజరు కావాలని కోరారు.

రేపు జెవివి సమావేశం

శ్రీకాకుళం అర్బన్: జన విజ్ఞాన వేదిక జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశం ఈనెల 5న నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.కామేశ్వరరావు, జి.గిరిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో చెకుముకి సైన్సు సంబరాలు, శాస్త్రీయ దక్పథ క్యాంపెయిన్, కల్చరల్, మ్యాజిక్, సోషల్ మీడియా వర్క్‌షాప్ తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి కార్యవర్గ సభ్యులు హాజరు కావాలని కోరారు.

నేడు సమీక్షా సమావేశం

మెళియాపుట్టి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10:30కు ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని మండల ప్రత్యేకాధికారి భవాని శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి టిఎంయు టీం సభ్యులైన మండలస్థాయి అధికారులు పూర్తి సమాచారంతో కార్యక్రమానికి హాజరుకావాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో శనివారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఇఇ ప్రసాదరావు తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. కాశీబుగ్గ పరిధిలో పాత జాతీయ రహదారి, పూజారి వీధి, వెంకటేశ్వర కాలనీ, శ్రీనివాస్ నగర్, ఎంపిడిఒ కార్యాలయం, రోటరీ నగర్, నెహ్రూ నగర్, నెమలి నారాయణ పురం, తర్లకోట, అల్లుకోల, రెంటి కోట, లొద్దభద్ర, మేధా స్కూల్ రోడ్డు, కాశీబుగ్గ ఉన్నత పాఠశాల తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా అంధత్వ నివారణా సంస్థ ఆధ్వర్యాన శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురం కెజిబివిలో చదువుతున్న 50 మంది విద్యార్థినులకు శుక్రవారం కళ్లద్దాలను అందజేశారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టరు షేక్ చాందిని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరీక్షించి, దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఆప్తాల మిక్ అధికారి ఎం.ఆర్.కె దాస్, సిహెచ్ఒ ఎస్తేరమ్మ, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ అప్పల నారాయణమ్మ, ఎఎన్ఎం లక్ష్మి పాల్గొన్నారు.

ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి- పలాస

మండలం రేగులపాడు ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులను పున్నప్రారంభం చేపట్టాలని పలాస నియోజకవర్గ జనసేన నాయకులు డాక్టర్ వి.దుర్గారావు డిమాండ్ చేశారు. శుక్రవారం రేగులపాడు వద్ద ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత నాలుగేళ్ల నిద్రపోయి గత వేసవి కాలంలో మట్టి పనులు ప్రారంభించి ప్రభుత్వం చేతులు దులుపుకుంటున్నారని, చేసిన పనులకు సంబంధిత కాంట్రాక్టర్‌కు నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడికక్కడ పనులు ఆగిపోయాయన్నారు. ప్రజా ప్రతినిధులు పర్సంటేజీల కోసం కాంట్రాక్టర్ మీద ఒత్తిడి చేసి పనులను అడ్డుకోవడం దారుణమన్నారు. ఈ ప్రాంత ప్రజల ప్రయోజనాల కోసం నిర్మించ తలపెట్టిన ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు కోసం నిధులు తేకుండా, వచ్చిన నిధుల్లో ధనార్జన ధ్యేయంగా ఇలాంటి ప్రజాప్రతినిధులను వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు.

ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న దుర్గారావు

జనసేన కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించి పూర్తి చేసి ఈ ప్రాంత ప్రజానీకానికి సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈయనవెంట ధర్మారావు, గుంట కిరణ్ కుమార్, శంకరరావు, హేమ సుందరరావు పాల్గొన్నారు.

కరువు ప్రభుత్వానికి కనిపించదా?

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఒకవైపు, వంశధార నీరు అందక జిల్లాలో కరువు విలయతాండవం చేస్తుంటే ప్రభుత్వానికి పట్టదా అని కౌలు రైతు సంఘం జిల్లా నాయకుడు బమ్మిడి ఆనందరావు ప్రశ్నించారు. శుక్రవారం పూండిగల్లిలో విలేకరులతో మాట్లాడారు. ఆగష్టు, సెప్టెంబర్‌లో మైనస్ వర్షపాతం, అక్టోబర్‌లో జీరో వర్షపాతమని ప్రభుత్వమే ప్రకటించిందని, కరువు జిల్లాగా ఎందుకు ప్రకటించ లేదని ప్రశ్నించారు. గత నాలుగేళ్లుగా వంశధార శివారు భూములకు సాగునీరు అందక రైతు ఘోష ఈ ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. వంశధారలో పూడికలు తీయకుండా సాగునీరు ఎలా వస్తుందన్నారు. ఇటీవల వ్యవసాయ సలహా మండలి సమీక్షలో ప్రభుత్వ డొల్లతనం బయట పడిందన్నారు. రాజకీయ ఉపన్యాసాలలో గత ప్రభుత్వాలపై బురద జల్లుతూ రైతులను మంత్రి అప్పలరాజు మభ్య పెడుతున్నారని ఆరోపించారు. రైతులు నుండి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోక ముందే పంట నష్టపోయిన మండలాలను కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే రైతులతో కలిసి మహా ఉద్యమానికి సిద్ధమని హెచ్చరించారు.

మాట్లాడుతున్న ఆనందరావు

యువత ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

18 ఏళ్లు నిండిన యువత ఓటర్లుగా నమోదు చేసుకోవాలని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు అన్నారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వచ్చే నెల తొమ్మిదో తేదీ వరకు ఓటర్ల నమోదు, తొలగింపు, సవరణలకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 2,357 పోలింగ్ కేంద్రాల్లో ఈనెల 4, 5 తేదీల్లో ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల్లోపు బిఎల్‌ఒలు అందుబాటులో ఉంటారన్నారు. 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18ఏళ్లు నిండిన వారు కొత్తగా తమ పేర్లు నమోదు కోసం ఫారం 6, చనిపోయిన, బోగస్ ఓట్ల తొలగింపు, శాశ్వత నివాసం లేని వారి పేర్లను జాబితాల నుంచి తొలగించడానికి ఫారం 7, సవరణలు చేసుకునేందుకు ఫారం 8ను బిఎల్‌ఒలకు అందజేసి రశీదు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న అప్పలనాయుడు

రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- రణస్థలం

తీవ్ర వర్షాభావ పరిస్థితి వలన నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎచ్చెర్ల నియోజవర్గం టిడిపి నాయకులు, ఉత్తరాంధ్ర టిడిపి శిక్షణా శిబిరం మాజీ డైరెక్టర్ కలిశెట్టి అప్పలనాయుడు అభ్యర్థించారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ టిడిపి సర్వసభ్య సమావేశానికి అప్పలనాయుడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఎచ్చెర్ల, రణస్థలం, లావేరు, జి. సిగడాం మండలాల రైతాంగం నష్టపోయారన్నారు. ఈ మండలాల్లో రైతులు సాగు చేపట్టిన అన్ని రకాల పంటలు తీవ్ర వర్షాభావ పరిస్థితి కారణంగా పూర్తిగా నాశనమయ్యాయన్నారు. ప్రభుత్వం నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సమావేశంలో తీర్మానించారు. ఈ తీర్మానం కాపీలను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులకు అందజేయనున్నట్టు తెలిపారు.

అంతర్ కళాశాల స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన అభ్యర్థులు

అంతర్ కళాశాలల స్విమ్మింగ్ పోటీలకు ఎంపికలు

ఇచ్ఛాపురం: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 అంతర్ జూనియర్ కళాశాల స్విమ్మింగ్ పోటీలు శ్రీకాకుళంలో డిఎస్ స్విమ్మింగ్ పూల్‌లో స్కూల్‌గేమ్స్ సెక్రటరీ పీడీ ఎన్.రామాను ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. ఈ పోటీల్లో సుమారు 40 మంది పాల్గొన్నారు. ఇందులో ఇచ్ఛాపురంకు చెందిన ఏడుగురు ఎంపికయ్యారు. జిల్లాకోచ్ సుభాన్, బత్తుల రామారావు ఎంపికలు చేశారు. పోటీలు తిరుపతిలో 11 నుంచి రెండు రోజులపాటు జరుగుతాయని బత్తుల రామారావు తెలిపారు. ఈ పోటీలకు ఇచ్ఛాపురంకు చెందిన ఏడుగురు స్విమ్మర్‌లు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

బస్సు యాత్రను విజయవంతం చేయాలి

పొందూరు: ఆమదాలవలస పట్టణంలో ఈ నెల 7న నిర్వహించనున్న వైసిపి సామాజిక సాధికారత బస్సు యాత్రను విజయవంతం చేయాలని జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావులు కోరారు. మండలం మలకాం గ్రామంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 7న చేపడుతున్న బస్సు యాత్రకు మండలంలోని వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. సమావేశంలో పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వైసిపి మండల జెసిఎస్ బాడాన వెంకట కృష్ణారావు, పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు, ఎంపిటిసి ప్రతినిధి మోహనరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పట్టుపురంలో 'భవిష్యత్‌కు గ్యారంటీ'

మెళియాపుట్టి : మండలంలో పట్టుపురం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని రాష్ట్ర టిడిపి కార్యదర్శి కలమట సాగర్ శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పోస్టర్లను అందజేశారు. టిడిపి మినీ మేనిఫెస్టోను మహిళలకు, యువతకు ఇచ్చిన హామీలను వివరించారు. వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక మోసపూరిత విధానాలను వివరించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు భాస్కర్ గౌడ, జిల్లా మహిళా ఉపాధ్యక్షులు లలిత కుమారి, పరమేశ్వర్ రెడ్డి, పడాల శ్రీను, అగ్గాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోవాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మూఢనమ్మకాలు, అశాస్త్రీయ భావనల వలన సమాజం అభివృద్ధిలో కుంటుపడుతుందని, విద్యార్థులు, యువత శాస్త్రీయ దృక్పథంతో సమాజాభివృద్ధికి కృషి చేయాలని జనవిజ్ఞాన వేదిక నాయకులు బొడ్డేపల్లి జనార్ధనరావు, బొడ్డేపల్లి మోహనరావులు అన్నారు. శుక్రవారం లక్ష్మీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో జనవిజ్ఞాన వేదిక పోస్టర్‌ను ప్రదర్శించారు. జనవిజ్ఞాన వేదిక షెడ్యూల్ ప్రకారం నవంబర్ 10న హైస్కూల్ స్థాయి చెకుముకి సైన్సు సంబరాలు, నవంబర్ 30న మండల, పట్టణ స్థాయి సైన్సు సంబరాలు, డిసెంబర్ 17న జిల్లాస్థాయి, 2024 జనవరి 27, 28 తేదీల్లో రాష్ట్రస్థాయి సైన్సు సంబరాలు జరుగుతాయని జనవిజ్ఞాన వేదిక నాయకులు తెలిపారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు

కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు హనుమంతు వెంకట సత్యనారాయణ, బొడ్డేపల్లి రామకృష్ణ, కర్రి అప్పలనాయుడు, జి.మన్మధరావు, బెండి సూర్యనారాయణ పాల్గొన్నారు.

అన్ని గ్రామ సంఘాలతో సమావేశాలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

డిఆర్‌డిఎ ఉన్నతాధికారులు సూచనలు మేరకు ఈ నెల 10నుంచి 20 వరకు అన్ని గ్రామ సంఘాలతో ప్రత్యేక జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించాలని వెలుగు ఎపిఎం ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలు సూచనలు చేశారు. అలాగే ఏప్రిల్ 2023 నుంచి సెప్టెంబర్ 2023 వరకు గ్రామ సంఘంలోని, మండల మహిళా సమైక్యలో ఉన్న రుణాలు, వాటాధనం, పొదుపులు, ఇతర గ్రాంట్లు, బ్యాంకు లింకేజీ రుణాలకు సంబంధించి వివరాలపై సంఘం వారి డిమాండ్, కలెక్షన్, బ్యాలెన్స్ షీట్ తయారు చేయ్యాలన్నారు. గత మూడు సంవత్సరాలుగా జరిగిన ఆడిట్ రిపోర్టులు సిద్ధం చేసుకోవాలని, కార్యాచరణ ప్రణాళిక వివరించారు. కార్యక్రమంలో సాహు చిట్టిబాబు, అకౌంటెంట్ మోహిని, సిసి మోహనరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెలుగు ఎపిఎం ప్రసాదరావు

టిడిపిలో 20 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలం కురుడు పంచాయతీకి చెందిన 20 కుటుంబాలు శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో వైసిపి నుంచి టిడిపిలో చేరారు. పార్టీలో చేరిన వారికి అచ్చెన్నాయుడు టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం చేస్తున్న కక్షపూరిత పరిపాలన వలన రాష్ట్రం నాశనం అయిపోతుందని, ఆ పార్టీలో ఉంటే వారికి ప్రజలు నమ్మరని తెలుసుకొని వైసిపి నేతలు టిడిపిలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీ చేరిన వారిలో తవుడు, బి.గణపతి, బి.జగ్గారావు, ఎం.సోమేష్, పి.దుర్గాప్రసాద్, పి. రమేష్, పి. కసవయ్య తదితరులున్నారు.

టిడిపిలోకి ఆహ్వానిస్తున్న అచ్చెన్నాయుడు

పార్టీలకతీతంగా 'కోట' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గానికి చెందిన సీనియర్ వైసిపి నాయకులు కోట గోవిందరావు జన్మదిన వేడుకలు పట్టణంలోని ఆయన కార్యాలయంలో అభిమానులు, వైసిపి కార్యకర్తల మధ్య ఘనంగా జరిగాయి. తమ్మినేని సీతారాం వ్యతిరేకవర్గాల నాయకులు అందరూ కలిసి గోవిందరావు జన్మదిన వేడుకల్లో పాల్గొనడంతో పట్టణంలో పలు రకాల గుసగుసలు వినిపించాయి. నియోజకవర్గంలో తమ్మినేనికి వ్యతిరేక వర్గంగా ముద్రగపడిన సువ్వరి గాంధీ ఈ వేడుకల్లో పాల్గొని గోవిందరావుకు కేకును తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. మండలానికి చెందిన వైస్ ఎంపిపి సోమరాజు జగన్నాథం, పలువురు వైసిపి నాయకులు, టిడిపి నాయకులు ఈ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నియోజకవర్గంలో అన్ని పార్టీల్లో ఉన్న నాయకులతో బంధుత్వాలతో పాటు ప్రజల్లో కూడా గుర్తింపు పొందిన నాయకునిగా కోట గోవిందరావు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ సర్పంచ్ కోట వెంకట రామారావు, కోట జస్వంత్, బిజెపి నాయకులు పాతిన గడ్డయ్య, వైసిపి నాయకులు బత్తుల బుజ్జి, పెయ్యల ప్రసాద్ పాల్గొన్నారు.

గోవిందరావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న గాంధీ

ఎఐకెఎంఎస్ జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- పలాస

మండలం బొడ్డపాడు గ్రామంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా 10వ మహాసభలను ఈనెల 7న నిర్వహిస్తున్నట్లు ఎఐకెఎంఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి వంకల మాధవరావు తెలిపారు. శుక్రవారం పలాస, మందస మండలాల్లో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక నల్లచట్టాలు తీసుకొచ్చి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కబంధహస్తాల్లో పెట్టడం దారుణమన్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది అతి తక్కువ వర్షపాతం నమోదయిందని, దీని వలన వరినాట్లు వేసిన రైతాంగం తీవ్ర నష్టాలకు గురై అప్పులు ఊబిలో కురుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నష్టపరిహార జాబితాలను సిద్ధం చేసి కరువు మండలాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు మామిడి భీమారావు, ఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ జుత్తు వీరస్వామి, మోహన్, రామారావు పాల్గొన్నారు.

సజావుగా సామర్థ్య పరీక్షలు

ప్రజాశక్తి- టెక్కలి

జాతీయ విద్యామండలి ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యాశాఖ పర్యవేక్షణలో తలపెట్టిన ఎస్ఇఎ(రాష్ట్ర విద్యా అచీవ్‌మెంట్) విద్యార్థుల సామర్థ్య పరీక్షలు శుక్రవారం జరిగాయి. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో చదువుతున్న 3, 6, 9 తరగతుల విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ప్రశ్నాపత్రాల్ని విద్యాశాఖాధికారులు ఆయా పాఠశాలలకు పంపించగా పర్యవేక్షకులుగా డిగ్రీ చదువుతున్న విద్యార్థులను నియమించారు. తరగతి ఉపాధ్యాయునికి కూడా పరీక్ష హల్‌లోకి ప్రవేశం లేకుండా నిబంధనలు విధించారు. టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారిణి గార పగడాలమ్మ, మండల విద్యాశాఖాధికారులు దల్లి తులసిరావు రెడ్డి, దాసుపురం చిన్నారావులు పరీక్షల ఏర్పాట్లు, నిర్వహణను పరిశీలించారు. 1134 విద్యార్థులు హాజరు కావల్సియుండగా 28 మంది గైర్హాజరయ్యారు.

టిడిపి నాయకునికి గౌతు పరామర్శ

ప్రజాశక్తి- పలాస

మండలం తర్లకోట బూత్ ఏజెంట్, టిడిపి నాయకుడు పైల సోమేశ్వంరావు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి అవసరం వచ్చినా తన దృష్టికి తీసుకు వస్తే నావంతుగా సహకారాలు అందిస్తామని చెప్పారు. ఆమెతో పాటు పీరికట్ల విఠల్, దువ్వాడ సంతోష్, సప్ప నవీన్, సోమేష్, బమ్మిడి తారకేశ్వరావు, బమ్మిడి రాజారావు ఉన్నారు.

పరామర్శిస్తున్న శిరీష

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- సోంపేట

స్థానిక బారువ సామాజిక ఆసుపత్రిలో శుక్రవారం ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించిందని వైద్యాధికారి బాలకృష్ణ తెలిపారు. ఈ శిబిరంలో ఆస్పత్రి వైద్యులు హేమంత్ కుమార్, నరసింహా, ఇందు, సింహ, సూర్య, చంద్రశేఖర్‌తో పాటు పరిసర గ్రామాలకు చెందిన 25 మంది యువకులు రక్తదానం చేశారని తెలిపారు. రక్తదానం వలన ఆపద సమయంలో ప్రాణాలు నిలిపే వారయ్యారని అభినందించారు. రక్తదానం చేసిన వారందరికీ ఉచిత భీమ సౌకర్యాన్ని కల్పించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకుడు

చంద్రబాబు సిఎం కావాలి

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

చంద్రబాబు సిఎం అయితేనే పేదల కష్టాలు తీరుతాయని లేకుంటే కష్టాలు మరింత పెరుగుతాయని టిడిపి బిసీ సాధికారిత కన్వీనర్ బోయిన గోవిందరాజులు అన్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు మేరకు కోటబొమ్మాళి మేజరు పంచాయతీ పరిధి బూత్ నెంబర్ 308లో స్థానిక టిడిపి నాయకులతో కలిసి శుక్రవారం భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అందించబోయే పథకాల పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కోరాడ పెద్ద గోవిందా, ఎస్. రాంకుమార్, చిన్న గోవిందా, దేవాది సింహాద్రి, బొమ్మాళి ప్రసాదరావు, మూగి అచ్చెయ్యరెడ్డి పాల్గొన్నారు.